16న సర్ సీవీ.రామన్ యంగ్ జీనియస్ అవార్డుల ప్రదానం

బంజారాహిల్స్,ఫిబ్రవరి 13: సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 32వ సర్ సీవీ.రామన్ జాతీయస్థాయి టాలెంట్ సెర్చ్‌లో విజేతలకు ఈనెల 16న నాంపల్లిలోని లలిత కళాతోరణంలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించనున్నామని ఫౌండేషన్ నిర్వాహకులు లయన్ కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాలలో నిర్వహించిన టాలెంట్ సెర్చిలో భాగంగా 20మందికి గోల్డ్ మెడల్స్, 40మంది ర్యాంకర్లు, 400 జిల్లా స్థాయి ర్యాంకర్లకు గురుబ్రహ్మ పురస్కారాలు, ఛాత్రాలయ పురస్కారాలు అందజేయనున్నామన్నారు. అవార్డుల ప్రధానోత్సవానికి పలు రంగాలకు చెందిన ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొనున్నారని వివరించారు.

ఏఐవైఎఫ్ ఖైరతాబాద్ నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక

నూతన అధ్యక్షుడు కాంపల్లి కళ్యాణ్

కార్యదర్శి భగత్ సింగ్

హిమాయత్ నగర్, ఫిబ్రవరి 13 : ఏఐవైఎఫ్ ఖైరతాబాద్ నియోజకవర్గం నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాంపల్లి కళ్యాణ్, కార్యదర్శిగా మామిడి చెట్ల భగత్ సింగ్,ఉపాధ్యక్షులు ఎం.చంద్రశేఖర్ ఆజాద్, రమేష్. కె, జీ. రవి, సహాయ కార్యదర్శులుగా కె. నాగరాజు, మల్లేష్ సభ్యులు నవీన్ కుమార్, రాముడు, కె. నర్సింహలతో పాటు 13మంది కౌన్సిల్ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాంపల్లి కళ్యాణ్, భగత్‌సింగ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై బలమైన పోరాటాలు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని ఆయా డివిజన్‌ల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఐఐఎంసీ కళాశాలలో నాలెడ్జ్ టెస్ట్

ఖైరతాబాద్,ఫిబ్రవరి 13 : లక్డీకాపూల్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కాలేజీలో గురువారం విద్యార్థులకు బడ్జెట్ నాటెడ్జ్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్టులో ప్రతిభ చూపిన వారికి కాలేజీ ప్రిన్సిపాల్ కే. రఘువీర్ బహుమతులు ప్రదానం చేశారు.

తాగునీటి సరఫరాలో అలసత్వం వద్దు

- వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి
- సమీక్షా సమావేశంలో జలమండలి జీఎం ఎస్.హరిశంకర్

వేసవికాలంలో తాగునీటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్న జలమండలి జీఎం హరిశంకర్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 13: తాగునీటి సరఫరాలో అలసత్వం ప్రదర్శిస్తే ఉద్యోగులైనా.. మెంటెనెన్స్ ఏజెన్సీలైనా వేటు తప్పదని జలమండలి జీఎం ఎస్.హరిశంకర్ హెచ్చరించారు. వేసవిలో వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా చేయాలన్నారు. సీవరేజీ సమస్యలతో ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆదేశించారు. గురువారం జలమండలి డివిజన్ -6 డీజీఎంలు, మేనేజర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు , లైన్‌మెన్లు, మీటర్ రీడర్లు, ఏఎంఎస్ ఏజెన్సీలు, సీవరేజీ జెట్టింగ్ మిషన్ ప్రతినిధులతో తాగునీటి సరఫరాపై సమ్మర్ యాక్షన్ ప్లాన్, సమర్థవంతంగా మలివిడత 90 రోజుల సీవరేజీ నిర్వహణ, బిల్లుల వసూళ్లు, సిబ్బంది భద్రతా ప్రమాణాలు, కమర్షియల్ క్యాన్ల సర్వే, నాణ్యతా యాప్ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎంలు, మేనేజర్ల పనితీరుపై జీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా తాగునీటి సరఫరా.. సీవరేజీ సమస్యలు గుర్తించేందుకు వేసవి పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలోనే ఉండాలని ఆదేశించారు. మెంటెనెన్స్ ఏజెన్సీ లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని.. కమర్షియల్ క్యాన్‌ల మీటర్ రీడింగ్‌లో అవకతవకలకు పాల్పడితే బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. తాగునీటి సరఫరా.. ఇతర సమస్యలపై లైన్‌మెన్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పనికి ఆహార పథకం ప్రవేశపెట్టాలి

లేబర్ కార్డులను పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 13: హైదరాబాద్ మహా నగరంలో పనులు దొరకక ఇబ్బంది పడుతున్న భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం పనికి ఆహార పథకాన్ని ప్రవేశ పెట్టి వర్తింప చేయాలని జూబ్లీహిల్స్ సీఐటీయూ జోన్ కన్వీనర్ జె.స్వామి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రహ్మత్ నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్పీఆర్‌హిల్స్ చౌరస్తాలో జరిగిన సమావేశానికి హాజరై కార్మికులకు లేబర్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. లేబర్ లకు మెటర్నిటీ బెన్‌ఫిట్స్ , మ్యారేజ్ గిఫ్ట్ కింద ఇచ్చే రూ.30 వేల మొత్తాన్ని రూ.1 లక్ష చొప్పున పెంచాలన్నారు. సహజ మరణానికి ఇస్తున్న రూ1.30 లక్షలను రూ.5 లక్షలకు.. ప్రమాద కారణంగా మృతి చెందిన వారికి ఇస్తున్న రూ.6.30 లక్షలను రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు రూ.5 వేల పింఛను ఇవ్వాలని, నగరంలోని అన్ని లేబర్ అడ్డాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ అధ్యక్షులు బి.లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి బి.దేవదాస్, నాయకులు బి బాలయ్య, ఆర్. జైపాల్, ఏ ఆర్ నరసింహ, టి.భాగ్య రావు తదితరులు పాల్గొన్నారు

రామంజాపూర్ తండా రోడ్డుకు నిధులు మంజూరు

రామంజాపూర్ తండా రోడ్డుకు కోటి రూపాయలు నిధులు కేటాయించి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, తదితరులు

శంషాబాద్ రూరల్ : మండల పరిధిలోని రామంజాపూర్ గ్రామం నుంచి రామంజాపూర్‌తండా వరకు బీటీరోడ్డు నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు సహకార సంఘం వైస్ చైర్మన్ ప్రభుసాగర్‌తో పాటు పలువురు కలిసి వినతి పత్రం అందజేశారు. దీంతో ఎమ్మెల్యే నిధుల నుంచి గురువారం కోటి రూపాయలు కేటాయిస్తూ ఎమ్మెల్యే మంజూరు పత్రాలను గ్రామస్తులకు అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే కోటి రూపాయలు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మల్కారం సహకార సంఘం వైస్ చైర్మన్ ప్రభుసాగర్,నాగేష్,కొమరయ్య,ఎం రమ్‌దాస్, జగన్, హరి, పాండు, శంకర్, రాజేష్, మున్య, లోకేశ్వర్ తదితరులు ఉన్నారు.

యూసుఫ్‌గూడా ప్రభుత్వ పాఠశాలలో..

యూసుఫ్‌గూడా ప్రభుత్వ పాఠశాలలో గురువారం సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని ఆంగ్ల భాష దినోత్సవం నిర్వహించారు. పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ ప్రాముఖ్యతను పాఠశాల ఇన్‌చార్జి బి. నరసింహ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా సరోజినీదేవి నాయుడు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో ఇంగ్లిష్ టీచర్స్ పి. ప్రభాకర్, పావని, అనురాధ మాలతి తదితరులు పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 13:

వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలి

బండ్లగూడలో సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బండ్లగూడ,ఫిబ్రవరి 13: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీధి దీపాల మరమ్మతులు చేయాలని ఆల్ కాలనీ ఫెడరేషన్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్ శరత్‌చంద్రను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభ్యుదయ నగర్,కాళీ మందిర్‌తో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలగక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు.సబ్ హీ భారత్ సందర్భంగా మాసీదుల వద్ద శుభ్రం చేసి ఫాగింగ్‌ను చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఆఫ్ బీజేఎంసీ సభ్యులు నదీమ్,నరేందర్‌బాబు, ఖుత్బుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఎన్ఎస్‌యూఐ నాయకుడి రాజీనామా

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఎన్ఎస్‌యూఐ నాయకుడు ఎండీ సల్మాన్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : కాంగ్రెస్ పార్టీకి ఎన్ఎస్‌యూఐ నాయకుడు ఎండీ సల్మాన్ రాజీనామా చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 ఏండ్ల పాటు కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘంలో పని చేసిన నాకు సరైన గౌరవం ఇవ్వకపోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదికాలంలోనే ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వచ్చిన్నట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్న నాయకులు నిజమైన కార్యకర్తలను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో రాజేంద్ర నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతానని తెలిపారు.

ఓటర్లకు బ్రహ్మాస్త్రం 'నోటా'

ఆలిండియా నోటా కాంస్ట్యూయంట్ అసెంబ్లీ చైర్మన్ సాధా అరుణ

ఖైరతాబాద్: నోటా.. ఓటర్లకు బ్రహ్మాస్త్రం లాంటిదని ఆలిండియా నోటా కాంస్ట్యూయంట్ అసెంబ్లీ చైర్మన్ సాధా అరుణ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రావుతో కలిసి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపుల్లో నోటా మొదటి స్థానం వచ్చినా.. ఎన్నికలు రద్దు కావన్నారు. 2032 నాటికి వంద నియోజకవర్గాల్లో వంద శాతం ఓటింగ్ జరుగుతుందన్నారు. వంద నియోజకవర్గాల్లో నోటా మొదటి స్థానంలో ఉంటుందన్నారు. నోటా సహకారంతోనే సీఎం ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

మాట్లాడుతున్న సాధా అరుణ

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తాం

దుర్గానగర్ జంక్షన్ వద్ద జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 13: ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ సూచించారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్ జంక్షన్ వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డ్రైనేజీ లైన్‌ను సైడ్ నుంచి వేసేందుకు జీహెచ్ఎంసీ ఈఈ నరేందర్‌గౌడ్, ఏఈ నర్సింహమూర్తితో కలిసి పర్యటించి పరిశీలించారు. డ్రైనేజీ లైన్‌ను డెవలప్‌మెంట్ చేసేందుకు ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నామన్నారు. పనులు జరిగే సమయంలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.వాహనదారులు అభివృద్ధి పనులకు సహకరిస్తూ ..ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అలాగే మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో ఉన్న యూటర్న్ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్కారం: సోమాజిగూడలోని రాజ్‌భవన్ పాఠశాలలో జరిగిన క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమానికి డీఈవో రోహిణి హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు. – ఖైరతాబాద్

అనారోగ్యంతో మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు నర్సమ్మ మృతదేహానికి నివాళులర్పించిన అనంతరం ఆర్థికసాయం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆర్థిక సాయం అందజేత

బండ్లగూడ, ఫిబ్రవరి 13 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికురాలు నర్సమ్మ(65)అనారోగ్యంతో మృతి చెందింది.విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు రుద్రకుమార్,ప్రవీణ్ కుమార్‌లు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రభుత్వమే అమె కుటుంబాన్ని అదుకోవాలని వారు డిమాండ్ చేశారు.అమె కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కమిషనర్ శరత్‌చంద్రకు విజ్ఞప్తి చేశారు.అంతక్రియాల నిమిత్తం నాలుగు వేలు ఆర్ధిక సహాయం చేశారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, యాదగిరి,మోహన్‌రావు,రామాంజనేయులు,నవీన్,లక్ష్మినారాయణ, సుభాష్, సురేష్,శ్రీధర్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మక్క సారక్క జాతర

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుధవారం ప్రారంభమైన సమ్మక్క సారక్క జాతర వేడుకలు గురువారంతో ముగిశాయి.చివరి రోజు అనేక మంది భక్తులు పాల్గొన్ని అమ్మవార్లను దర్శించుకున్నారు. కొలిచిన వారికి కొంగు బంగారం నిలిచిన అమ్మవార్లను దర్శించుకునేందకు రాజేంద్రనగర్ శివారు ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు వచ్చేసినట్లు నిర్వాహకులు చంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం తమ కుటుంబ సభ్యులందరూ కలిసి అమ్మవార్లను వనంలోకి పంపనున్నట్లు వారు తెలిపారు. – బండ్లగూడ,ఫిబ్రవరి 13:

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

దుర్గానగర్ మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: నేటి సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని దుర్గానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సుజాత అన్నారు. పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఉపాధ్యాయల పాత్రను స్వయంగా నిర్వహిస్తూ విలక్షణమైన అనుభవాన్ని పొందారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సుజాత మాట్లాడుతూ ఉత్తమ పౌరులను తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రధాన లక్ష్యమన్నారు. ఒక ఉపాధ్యాయుడు తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తే రేపటి తరానికి స్ఫూర్తి కలుగుతుందన్నారు.

వారం రోజులు గడుస్తున్నా తొలగించని ఫ్లెక్సీలు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయి. ఈ నెల 6న కార్పొరేషన్ పరిధిలోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవనం ప్రారంభించారు.ఇందుకోసం వచ్చిన అతిథిలకు స్వాగతం పలుకుతూ స్థానిక నాయకులు టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి పోలీస్ అకాడమీ వరకు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.కాగా కార్యాక్రమం అయిన వెంటనే లేదా మరుసటి రోజు ఆయా ఫ్లెక్సీలను అధికారులు తొలగించాలి. కాని ఇప్పటి వరకు అధికారులు తొలగించకపోవడంతో అటునుంచి పోయే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. – బండ్లగూడ,ఫిబ్రవరి 13

ఆగిన అభివృద్ధి పనులు

సమస్యలతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు బుద్వేల్ భగవత్‌గూడలో పర్యటించిన కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్

స్థానికులతో కలిసి బుద్వేల్ భగవత్‌గూడలో సమస్యలు తెలుసుకుంటున్న రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన

బండ్లగూడ, ఫిబ్రవరి 13 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాజేంద్రనగర్‌లో అభివృద్ధి కుంటు పడిందన్నారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బదులకు గురవుతున్నారని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ పేర్కొన్నారు.గురువారం ఆమె స్థానికుల విజ్ఞప్తి మేరకు బుద్వేల్ భగవత్‌గూడలో పర్యటించారు.ఈ సందర్భంగా ప్రజలు ఆమె దృష్టికి అనేక సమస్యలను తీసుకొచ్చారు. ప్రధానంగా విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా వంగి ఉన్నాయని,ఇలాంటి స్తంభాల ద్వారా ప్రజలకు షాట్ సర్క్యూట్ అయ్యో అవకాశం ఉంటుందని ఆమెకు వివరించారు. ఇందుకు స్పందించిన కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.రాజేంద్రనగర్ డివిజన్‌లో సుమారు నాలుగు కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్,రాందాస్,సూర్యప్రకాశ్‌రెడ్డి,శ్రీనివాస్, మధు, ప్రవీణ్,బాల్‌రెడ్డి,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పేరుతో మరోసారి దగా చేసే కుట్ర

- మళ్లీ పూర్తిస్థాయిలో సమగ్రసర్వే చేయాలి
- బీసీ సాధికారత సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ కొండా దేవయ్య పటేల్

సమావేశంలో అభివాదం చేస్తున్న డాక్టర్ కొండ దేవయ్య పటేల్, సత్యం తదితరులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 13: రీసర్వే పేరుతో మరోసారి బీసీలను మోసగించాలని చూస్తే సహించమని, పూర్తి స్థాయిలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాలని బీసీ సాధికారత సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ అన్నారు. బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే బీసీల సంఖ్య తగ్గించిందని, ఆధార్, ఓటరు కార్డు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల సంఖ్య కలిపి మొత్తం 4.25కోట్ల జనాభా ఉండగా, తాజాగా విడుదల చేసిన కులగణన జాబితాలో కేవలం 3.64 కోట్లు ఉన్నట్లు పేర్కొనడంతోనే ప్రభుత్వ ద్వంద వైఖరి స్పష్టమవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 60 శాతానికి పైగా బీసీలుంటే 46 శాతానికి తీసుకొచ్చారని, సుమారు 25 లక్షల మంది బీసీలను జనాభా లెక్కల నుంచి తొలగించారని ఆరోపించారు. మరో పది రోజుల్లో 3.1శాతం మిగిలిన కులగణన చేపడుతామని చెబుతున్నారని, అది సక్రమంగా నిర్వహిస్తారన్న నమ్మకం లేదన్నారు. ఇప్పటికే విద్య, ఉద్యోగాల్లో తీవ్రంగా ఎంతో నష్టపోయామన్నారు. ఎస్సీ వర్గీకరణలో ఒక్క శాతం తగ్గితేనే మందకృష్ణ మాదిగ ఆందోళనకు తలొగ్గి ఇంటికి పిలిపించుకొని బుజ్జగించారని, 2కోట్లకు పైగా ఉన్న బీసీలు నష్టపోయామని ఆందోళన చేస్తుంటే పట్టించుకోవడం లేదన్నారు. తమిళనాడు మాదిరిగా బీసీల రిజర్వేషన్లు పెంచి 9వ షెడ్యూల్లోకి చేర్చి చట్టబద్ధత కల్పించాలన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. డిల్లీకి బీసీల తరపున అఖిలపక్ష కమిటీని తీసుకెళ్లాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం మాట్లాడుతూ హిందూ బీసీలు, ముస్లిం బీసీ లంటూ కులగణనలో పేర్కొనడం అవివేకమని, అది రాజ్యాంగంలో లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సాదామి భూమన్న యాదవ్, తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్, తెలంగాణ విట్టల్, బీసీ సాధికారిత సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బి శంకర్, ఆరె కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చలపతి రావు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పి. వాసు, బత్తుల సిద్దేశ్వర్, బేరి రాంచందర్ యాదవ్, మున్నూరు కాపు సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఆర్వీ మహేందర్, నాయకులు పెరుక రమేశ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కాలేజీలో..బౌన్సర్లు

అవినాష్ కామర్స్ కాలేజీల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి
సీపీని కోరిన ప్రజాసంఘాలు

నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు చేస్తున్న నరేందర్ గౌడ్

హిమాయత్‌నగర్ ఫిబ్రవరి 13: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కాలేజీలు నడుపుతున్న అవినాష్ కామర్స్ కాలేజీల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్‌ను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం కలిసి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రైవేట్ సైన్యం(బౌన్సర్స్)ను ఏర్పాటు చేసుకుని విద్యార్థులు వారి తల్లిదండ్రులపై కాలేజీ యాజమాన్యం దౌర్జన్యానికి దిగుతున్నారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో ఫీజు కట్టని విద్యార్థులను ఇంటర్నల్ పరీక్షలకు అనుమతి ఇవ్వకపోవడంతో పాటు ఫీజులు కట్టేందుకు ఏమాత్రం సమయం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మీ పిల్లల భవిష్యత్ మా చేతులో ఉంది జాగ్రత్త అని తల్లిదండ్రులను బెదిరిస్తున్నారని తెలిపారు. కాలేజీ ఆవరణలో ఉన్న ప్రైవేట్ బౌన్సర్లను తొలగించి, కాలేజీలో శాంతియుత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరా రు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరి గౌడ్, ఆజాద్ సోషల్ జస్టిస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు గణపతి బిక్కు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ - ఎంఎస్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బీఎస్– ఎంఎస్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్–ఎంఎస్ (కంప్యూటర్ సైన్స్– ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ డ్యూ యల్ డిగ్రీ ప్రోగ్రాం) మొద టి, మూడు, అయిదు, ఏడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 24 లోపు సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చేనెల 1 వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నారు. పరీక్ష తేదీ ల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.